సాక్షి
వనపర్తి
ఆదివారం । 10 । మార్చి । 2024



రోడ్డు విస్తరణతో పరేషాన్

రాయచూర్– కోదాడ రహదారి పనులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 8లో ▶



పథకాల అమలుపై అక్కసు

సంక్షేమ పథకాల అమలుపై బీఆర్ఎస్ అక్కసు వెళ్లగక్కుతోందని మంత్రి సీతక్క అన్నారు.

వివరాలు 10లో ▶

గరిష్టం/కనిష్టం
39.5 /22.0

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయ యోగా కోచ్‌గా సుగుణ



వనపర్తిటౌన్: జాతీయ యోగా చాంపియన్‌షిప్ కోచ్‌గా వనపర్తికి చెందిన యోగా గురువు దండు సుగుణ ఎంపికై ంది. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు జరిగే జాతీయ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ తరుపున పాల్గొనే బృందానికి ఈమె కోచ్‌గా వ్యవహరించనుంది. శనివారం జిల్లాకేంద్రంలో సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆమెకు అభినందనలు తెలిపి మాట్లాడారు. పోటీలో పాల్గొనే వారు రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రయత్నించాలని కోరారు.

రామన్‌పాడులో 1,014 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. శనివారం1,014 అడుగులకు చేరింది. కొత్తపల్లి వద్ద బ్యాక్ వాటర్ పూర్తిగా తగ్గింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

సింపోజియంలో పీయూ స్కాలర్‌కు అవార్డు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'నేచర్ ఇన్‌స్పైర్డ్ ఇన్నోవేటివ్ ఇన్ కెమికల్ ట్రెండ్స్' అంశంపై హైదరాబాద్‌లో జరిగిన సింపోజియంలో పీయూ రీసెర్చ్ స్కాలర్ విజయలక్ష్మికి బెస్టు పోస్టర్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆమె ఏ థెర్మో రెగ్యులేటెడ్ హైలీ రీజియో సెలెక్టివ్ మోనో అండ్ హై హాలోజినేషన్ ఆఫ్ ఫెనాల్స్ అండ్ అమైన్స్ ఇన్ వాటర్ బై లూయిస్ బేస్ అడక్ట్స్ ఆస్ గ్రీన్ రీజెంట్స్ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. మెదటి బహుమతి సాధించిన ఆమెకు ఐపీసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమెను పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రకిరణ్, నూర్జహాన్ తదితరులు అభినందించారు.

దేవరకద్ర మార్కెట్‌కు వరుస సెలవులు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు వరుస సెలవులు రావడంతో లావాదేవీలు నిలిచిపోయాయి. శుక్రవారం మహాశివరాత్రి సెలవు ఉండగా రెండో శనివారంతో మరోరోజు సెలవు కలిసిరాగా.. ఆదివారం సెలవు ఉంది. ఇలా మూడు రోజుల సెలవుతో మార్కెట్ వెలవెలబోయింది. తిరిగి సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

తాగునీటి గండం

జూరాల ప్రాజెక్టులో డెడ్‌స్టోరేజి



జూరాల జలాశయంలో అడుగంటిన నీరు

జూరాలలో నీటి నిల్వలు 2016 నుంచి 2024 వరకు

ఏడాది	నీటినిల్వ (టీఎంసీలలో..)
మార్చి 8, 2016	3.696
మార్చి 8, 2017	4.829
మార్చి 8, 2018	4.747
మార్చి 8, 2019	2.689
మార్చి 8, 2020	7.627
మార్చి 8, 2021	6.477
మార్చి 8, 2022	7.836
మార్చి 8, 2023	4.038
మార్చి 8, 2024	4.004

- ప్రస్తుతం జలాశయంలో 4.004 టీఎంసీల నీరు
- తాగునీటి అవసరాలకు రోజుకు 74 ఎంఎల్‌డీ వినియోగం
- యాసంగిలో ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించిన ప్రభుత్వం
- ఉన్న నీటితో ఏప్రిల్ వరకే మంచినీటి సరఫరా
- ఇప్పటికే ఉమ్మడి పాలమూరులో తాగునీటి కష్టాలు

గద్వాల రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లా జలప్రదాయిని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు నీటి కష్టమొచ్చింది. ఎనిమిదేళ్ల క్రితం నాటి పరిస్థితులు మరోసారి పునరావృతం అవుతున్నాయి. ఇప్పటికే ఎడమ, కుడి ప్రధాన కాల్వల కింద యాసంగికి పూర్తిగా క్రాప్ హాలిడే ప్రకటించగా.. ఉమ్మడి జిల్లా వాసులు తాగునీటి కోసం కూడా అల్లాడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం జూరాల జలాశయం నీటినిల్వను పరిశీలిస్తే ఏప్రిల్ నెలాఖరు నాటికే సరిపోతాయని మే, జూన్ మాసాలలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తవచ్చనే నివేదికను ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది.

జూరాల కింద క్రాప్ హాలిడే..

జూరాల జలాశయం కింద ఎడమ, కుడి ప్రధాన కాల్వలుండగా మొత్తం ఆయకట్టు 1.7 లక్షల ఎకరాలు. ప్రతి ఏడాది యాసంగి(రబీ)లో ఎడమ ప్రధాన కాల్వ కింద వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 85 వేల ఎకరాలు, కుడి ప్రధాన కాల్వ కింద గద్వాల జిల్లాలో 25 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. ఈ ఏడాది తీవ్ర వర్ష ప్రభావం నెలకొనడంతో గడిచిన ఎనిమిదేళ్లలో మూడోసారి జూరాల జలాశయంలో డిసెంబర్ నాటికే ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లోలు నిలిచిపోయాయి. దీంతో జూరాల ప్రాజెక్టు కింద ఎడమ, కుడి కాల్వల పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిని అందించడం కష్టతరంగా ఉందని అధికారులు రబీలో రెండుకాల్వల పరిధిలో క్రాప్ హాలిడే ప్రకటించారు.

■ జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలు తాగునీటి కోసం జూరాల జలాశయం మీదనే ఆధారపడి ఉన్నాయి. ఎండ తీవ్రతకు ఆవిరి రూపంలో వెళ్లే నీటిని కలుపుకొని తాగునీటి అవసరాలకు ఏడాదికి 1.50 టీఎంసీలు, ప్రతి రోజు 74ఎంఎల్‌డీలు అవసరమున్నట్లు మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జలాశయం పూర్తిగా అడుగంటిపోగా డెడ్‌స్టోరేజితో కలిపి 4.004 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఇందులో తాగునీటికి అవసరమైన ఎంబీ ఎండీడీఎల్ కింద 1.341 టీంఎసీలు మాత్రమే అందుబాటులో ఉందని.. ఇది కూడా ఏప్రిల్ నెలాఖరు వరకు మాత్రమే సరిపోతాయని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు.

కర్ణాటకే దిక్కు..

జూరాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పరిశీలిస్తే మరోసారి 2016, 2019 నాటి పరిస్థితులు తలెత్తనున్నాయి. మే నెలలో తాగునీటి అవసరాల కోసం మరోసారి కర్ణాటకపై ఆధారపడక తప్పదు. 2019లో తీవ్ర తాగునీటి సమస్యను అధిగమించేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి నుంచి 3 టీఎంసీలను విడుదల చేయాలని కోరగా.. వారు సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేశారు. అయితే 3 టీఎంసీలలో జూరాలకు కేవలం 1.7టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరింది.

కర్ణాటక నుంచే తీసుకోవాల్సి ఉంటుంది..

ప్రస్తుతం జూరాల కింద రబీలో క్రాప్‌హాలిడే ప్రకటించాం. జూరాల జలాశయంలో అందుబాటులో ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం. ప్రస్తుతం 4 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా.. ఇవి ఏప్రిల్ నెలాఖరు వరకు సరిపోతాయి. తరువాత మే, జూన్ వరకు తాగునీటిని అందించాలంటే డ్యాంలో నీళ్లు ఉండవు. ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి నీటిని తీసుకోవాల్సి ఉంటుంది.

– జుబేర్, ఈఈ జూరాల గద్వాల

ప్రత్యామ్నాయ చర్యలు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏడాది పొడవున మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలంటే 1.25టీఎంసీల నీరు అవసరం. వేసవిలో ఎండలకు ఆవిరి రూపంలో సుమారు 0.50టీఎంసీల నీరు వృథా అవుతుండగా.. తాగునీటి కోసం మరో 0.36టీఎంసీలు అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని పొదుపు చేసుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా స్థానికంగా అందుబాటులో ఉన్న తాగునీటి వనరులను గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా వనరులు అందుబాటులో లేకపోతే ట్రాక్టర్ల ద్వారా తాగునీటిని అందిస్తాం.

– శ్రీధర్‌రెడ్డి, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్, గద్వాల

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి కోసం ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి 15 వరకు గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులను పునరుద్ధరణపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. చేతిపంపులు, బావులు, పంపుసెట్లు, బోర్లు, బోర్లు ఫ్లషింగ్ వంటి వాటిని గుర్తించి.. వాటిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించేలా యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఇందుకోసం జోగుళాంబ గద్వాల జిల్లాకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి రూ.3.21కోట్లు నిధులు విడుదల చేశారు.



గద్వాల 34వ వార్డులో తాగునీటి ఇబ్బందులు

మహిళల రక్షణే షీటీం లక్ష్యం

ఎస్పీ రక్షిత కె.మూర్తి



వనపర్తి: మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వేధింపులకు గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటుంటే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి శనివారం సూచించారు. మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కచ్చితంగా చర్యలు తీసుకునేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు గురైనా.. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే షీటీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఎస్పీ అభయమిచ్చారు. షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ బృందాలతో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. షీటీమ్స్‌కు ఫిబ్రవరి నెలలో 5 ఫిర్యాదులు రాగా.. 3 పెట్టీ కేసులు నమోదు చేయగా, పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వివరించారు. చిన్నారుల రక్షణ విషయంలో పోలీసుశాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందన్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగామ్ వినియోగంలో మహిళలు, యువతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలీసులను నేరుగా సంప్రదించలేని వారు సెల్‌ఫోన్ నంబర్ 6303923211, డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

మహిళల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యం



సన్మానించిన మహిళలతో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

అమరచింత: మహిళా సాధికారిత కోసం గత ప్రభుత్వాలు చేసింది శూన్యమని.. బీజేపీ హయంలోనే మహిళల అభ్యున్నతితో పాటు సాధికారత సాధ్యమైందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలో చేతివృత్తులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న పలువురు మహిళలను ఆమె శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు గర్వించేస్థాయిలో భారత్‌ను నిలిపేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించేలా వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో చేతివృత్తిదారులకు ఆత్మనిర్భర్ రుణాలు మంజూరు చేసిందని, నేటికీ చిరువ్యాపారులు వాటిని వినియోగించుకుంటూ ప్రయోజనాలు పొందుతున్నారని వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలను బీజేపీ గెలుచుకోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేయడానికే కంకణం కట్టుకున్నాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ఇప్పటి వరకు రైతుబంధు, రుణమాఫీపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై బీజేపీ పోరాడుతుందని.. దేశ ప్రయోజనాలు కాపాడటమేగాక అన్నివర్గాల అభ్యున్నతికి మరోమారు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొండయ్య, రాష్ట్ర కిసాన్‌సెల్ కార్యవర్గసభ్యుడు వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, రెండోవార్డు కౌన్సిలర్ లావణ్య, రాకేష్ శెట్టి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగఢ్ దశ మారేనా?

- పర్యాటకంగా అభివృద్ధికి దూరం
- 18వ శతాబ్దంలో నిర్మించిన రాతి కోట
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కోట పైభాగంలోని రాతి కొలనులు



కోట ముఖద్వారం

అమరచింత: ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యంత పురాతన కట్టడాల్లో చంద్రగఢ్ కోట ఒకటి. పచ్చటి పంట పొలాల మధ్యలో ఎత్తైన కొండపై ఉన్న ఈ కోట నేటికీ చెక్కు చెదరకుండా నాటి రాజుల కాలాన్ని గుర్తుకు తెస్తోంది. కోట మధ్యలో రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ఎనిమిది చిన్న చిన్న కొలనులు ఉన్నాయి. ఈ కొలనుల్లో ఏడాది పొడవునా నీరు ఉండటం మరో విశేషం. పూర్తిగా రాతితో నిర్మించిన కోట చూడగానే అప్పటి నిర్మాణ శైలి గుర్తుకొస్తుంది. 18వ శతాబ్దంలో మరాఠి రాజులు బాజీలరావు పీశ్వా ఆత్మకూర్ సంస్థానానికి సంబంధించిన పన్ను వసూళ్లకు చంద్రసేనుడిని నియమించారు. చంద్రసేనుడు ఈ ప్రాంతంలోని ధర్మాపురం గ్రామంలో గ్రామానికి ఉత్తర దిశగా ఉన్న ఎత్తైన కొండపై కోట నిర్మించారు. ఇక్కడి నుంచే వివిధ సంస్థానాదీశుల నుంచి పన్ను వసూళ్లు చేసి మరాఠాకు పంపించేవారు. చంద్రసేనుడు నిర్మించిన కోట కావడంతో కాలక్రమేణ చంద్రగఢ్ కోటగా పిలువబడుతోంది. కోటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏటా ఉత్సవాలతో పాటు నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. కాని ప్రస్తుతం నిర్వహణ లేక కోట శిథిలావస్థకు చేరి కనుమరుగయ్యే పరిస్థితులు దాపురించాయి.

శిథిలమవుతున్న కోటగోడలు..


కోట లోపలి రాతిగోడలు ఒక్కొక్కటిగా శిథిలమవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్ కోటను సందర్శించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అప్పట్లో కేవలం కోటపైకి వెళ్లడానికి వీలుగా సీసీ రహదారి నిర్మించి వదిలేశారు. అనంతరం పట్టించుకునే వారే కరువయ్యారు.

శత్రుసైన్యాన్ని గుర్తించేలా..

కోట పైభాగంలో ఉండే సైనికులు శత్రుసైన్యం దండెత్తడానికి వస్తే వారిని సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచే పసిగట్టి ఫిరంగులతో దాడి చేసేందుకు వీలుగా కోటగోడ భాగంలో భారీ రంధ్రాలను ఏర్పాటు చేశారు. వీటి నుంచి శత్రువుల రాకపోకలను గుర్తించి ఎదుర్కొనే అవకాశం ఉంది.

రాతి కొలనులు ప్రత్యేకం..

అప్పట్లో కోట పైభాగంలో రక్షణగా ఉండే భటులతో పాటు సిబ్బంది తాగునీటి కోసం కోటలోని రాతి పొరలను తొలచి నీటి చెలిమలను గుర్తించారు. దీంతో ఆయా కొలనుల్లో నిరంతరం నీరు నిల్వ ఉంటుంది. వీటిలో తామరపూలు సైతం ఉండటం, సాక్షాత్తు పరమశివుడు కొలువైన గుట్ట కావడంతో గంగమ్మ తల్లి ఇక్కడ కొలువైందని భక్తులు విశ్వసిస్తారు.



చంద్రగఢ్ కోట

ఉమ్మడి జిల్లాకే ఆదర్శం..



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న పర్యాటకులు అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రగఢ్ కోటను చూడటానికి వస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– నాగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, చంద్రగఢ్

పర్యాటక అభివృద్ధికి..



అతి ప్రాచీన కోట అయిన చంద్రగఢ్‌ను పర్యాటకంగా అభివృద్ధిపర్చాలి. ఇందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చొరవ చూపాలి. పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– వెంకటేష్, అమరచింత

ప్రాచీన కట్టడాలను పరిరక్షించాలి..



నాటి మరాఠా రాజుల కట్టడాలను, చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు చంద్రగఢ్ కోటను పరిరక్షించాలి. ప్రాచీన కట్టడాలను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానిదే. పూర్తిస్థాయిలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– మల్లారెడ్డి, కిష్టంపల్లి

బ్రహ్మోత్సవాలకు వేళాయె..



వనపర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

- ఈ ఏడాది విభిన్న రూపాల్లో అలంకరణోత్సవం ప్రత్యేకం
- 15వ తేదీ వరకు కొనసాగింపు

వనపర్తిటౌన్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ఆరురోజుల పాటు కొనసాగనున్నాయి. తిరుమలలోని వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ రూపం తరహాలోనే ఇక్కడి స్వామివారు ఉండటం విశేషం. ఆలయంలో నిత్యోత్సవం, వారోత్సవం, పక్షోత్సవం, మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 46 ఏళ్ల క్రితం పెద్దజీయర్‌స్వామి స్వామివారు ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ చేశారని.. అప్పుడే ఆయన స్వామివారి సన్నిధిలో అరగంటకు పైగా ఉన్నారని ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్త అయ్యలూరి రఘునాథాచార్యలు తెలిపారు. ఈ ఏడాది కూడా తిరుమల తరహాలోనే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కాల సర్ప, కుజ, రాహు దోషాల నివారణ, సంతానప్రాప్తికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజరోహణంలో అందించే గడ ప్రసాదం స్వీకరిస్తే అన్ని శుభాలు చేకూరుతాయని, ఇందుకు ఆలయంలో ఎన్నో నిదర్శనలు ఉన్నాయని చెప్పారు. గరుడ హోమంలో పాల్గొన్నా కాల సర్ప దోషాలు, రాహు, కుజ దోషాలు తొలగుతాయన్నారు. అత్యంత శక్తివంతమైన సుదర్శన నారసింహ ఇష్టిని ప్రముఖ సుదర్శన ఉపాసకులు, యజ్ఞాచార్యులు చక్రవర్తుల సుధన్వాచార్యులు కైంకర్యాలు చేయనున్నట్లు వివరించారు. ఆలయంలో నిర్వహించే లక్ష్మీహయగ్రీవ ఇష్టితో విద్యాబుద్ధులు, మానసిక సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందన్నారు. స్వామివారికి 25 రకాల అభిషేకాలతో చక్రతీర్థం జరిపిస్తామని, రోజు తిరుమల తరహాలో ఉత్సవమూర్తులను అలంకరించేందుకు హైదరాబాద్ నుంచి అర్చకులను పిలిపిస్తున్నట్లు చెప్పారు.

■ బ్రహ్మోత్సవాల కరపత్రాలను శనివారం ఆలయ ఆవరణలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గురుప్రసాద్, ప్రవీణ్, మేనేజర్ గంగాధర్, వికాస తరంగిణి ప్రతినిధి నరేందర్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు..

- 11వ, తేదీన ఉదయం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, భేరిపూజ, దేవతాహ్వానం
- 12న శ్రీవారి ఎదుర్కోళ్ల ఉత్సవం, వాహన సేవ,
- 13న చతుస్థానార్చన, అనంతరం ఆశ్విని నక్షత్రంలో శ్రీవారి కల్యాణ మహోత్సవం
- 14న తిరుప్పావడ సేవ, రథాంగ హోమం, శ్రీవారి రథోత్సవం
- 15న చతుస్థానార్చన, మహాపూర్ణహుతి, చక్రతీర్థం, ద్వాదశారాధన, దేవత ఉద్వాసన, ధ్వజ అవరోహణం, శ్రీపుష్ప యాగం, సప్తవర్ణసేవ, కుంభప్రోక్షణ సేవలతో బ్రహ్మోత్సవాలు ముగియన్నాయి.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మానవపాడు: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొర్విపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుర్వ మల్లన్న (47) కొంత కాలంగా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యం బాగాలేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 7వ తేదీన ఇంట్లో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ తరలించారు. కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందాడు. భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుడిసెలో కాడెద్దు సజీవ దహనం



ధరూరు: వ్యవసాయ పొలం వద్ద ఓ రైతు ఏర్పాటు చేసుకున్న వరిగడ్డి వాము, గుడిసెకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయాయి. గుడిసెలో కట్టేసిన కాడెద్దు సజీవ దహనమైన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగు రంగన్నకు చెరువు కింద కొంత వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయ పొలం పనుల కోసం తెచ్చిన పనిముట్లతో పాటు కాడెడ్లను కట్టేసేందుకు ఓ గుడిసెను ఏర్పాటు చేశాడు. ఎప్పటిలాగే రంగన్న తన రెండు కాడెద్దులను గుడిసెలో కట్టేసి తన పనిలో నిమగ్నమయ్యాడు. శనివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో గడ్డి వాముకు, గుడిసెకు నిప్పంటుకుంది. గుడిసెలో ఉన్న రెండు ఎద్దుల్లో ఒకటి తాడు తెంచుకుని బయటకు పరుగులు తీసింది. మరో ఎద్దు తాడు తెగకపోవడంతో అందులోనే చనిపోయింది. దీంతో అప్రమత్తమైన సదరు రైతు కుటుంబం, చుట్టు పక్కల రైతులు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రమాదవశాత్తు నిప్పంటుకుందా లేక ఎవరైనా నిప్పు పెట్టారా? అనేది తెలియాల్సి ఉంది. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు- ద్విచక్రవాహనం ఢీ

- ముగ్గురికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శివ, వెంకటేష్, తిరుపతయ్య ద్విచక్రవాహనంపై నాగర్‌కర్నూల్‌కు వస్తుండగా, అదే సమయంలో కొల్లాపూర్ వైపు ఆర్టీసీబస్సు వెళ్తోంది. ఈక్రమంలో పెద్దముద్దునూర్ శివారులో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో శివ, వెంకటేష్, తిరుపతయ్య తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సును స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం
- లారీ డ్రైవర్‌కు గాయాలు



భూత్పూర్: మండలంలోని పోతులమడుగు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి రికవరీ లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, ప్రయాణికుల కథనం ప్రకారం హైదరాబాద్ నుంచి కేరళలోని ఎర్నాకులంకు 30 మంది ప్రయాణికులతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బయలుదేరింది. పోతులమడుగు వద్ద జాతీయ రహదారిపై జడ్చర్ల నుంచి భూత్పూర్ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లేందుకు రికవరీ లారీ యూ టర్న్ తీసుకుంటుండగా ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ ఏసుబాబుకు గాయాలయ్యాయి. ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న భూత్పూర్ పోలీసులు గాయపడిన ఏసుబాబును అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికులను తరలించేందుకు మరో వాహనాన్ని రప్పిస్తున్నట్లు బస్సు డ్రైవర్ దస్‌పాల్ తెలిపారు. రికవరీ లారీ డ్రైవర్ యూ టర్న్ వద్ద సిగ్నల్ వేయకుండా అకస్మాత్తుగా మళ్లగా, వెంటనే బస్సు బ్రేక్ వేసినట్లు బస్సు డ్రైవర్ చెప్పారు. ఎదురుగా కొత్తకోట వైపు నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులతో పరేషాన్

- ఒకేసారి 167వ జాతీయ రహదారి ఇరువైపులా పనులు ప్రారంభం
- నిత్యం ట్రాఫిక్‌తో సతమతం
- త్వరగా పనులు పూర్తి చేయాలని పట్టణవాసుల డిమాండ్



పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



డిగ్రీ కళాశాల హస్టల్ సమీపంలో..

జడ్చర్ల టౌన్: జాతీయరహదారుల విస్తరణలో భాగంగా రాయచూర్-కోదాడ వరకు చేపట్టిన 167వ నంబర్ జాతీయరహదారి పనులు పట్టణవాసులకు ఇక్కట్లపాలు చేస్తున్నాయి. సిగ్నల్‌గడ్డపై ఎల్‌బీసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల హాస్టల్ భవనం వరకు 750మీటర్ల రోడ్డు విస్తరణ పనులు ఏడాది క్రితం ప్రారంభించారు. సిగ్నల్‌గడ్డ రైల్వే లైన్‌కు ఇరువైపులా విస్తరణ పనులు చేపట్టాల్సి రావటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో పట్టణవాసులు, వాహనదారులు సతమతమవుతున్నారు. అందులోనూ పనులను రోడ్డుకు ఇరువైపులా ఒకేసారి చేపట్టడంతో సమస్య జఠిలంగా మారింది.

గంటల తరబడి ట్రాఫిక్ జాం

ఎల్‌బీసీ కార్యాలయం నుంచి హైస్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేసి రోడ్డును సైతం తవ్వి కంకర వేస్తున్నారు. డిగ్రీ కళాశాల హాస్టల్ భవనం నుంచి కళాశాల కమాన్ వరకు డ్రెయినేజీ నిర్మాణం చేసి కంకర వేసి వదిలేశారు. కంకర వేసిన చోట దుమ్ముధూళి లేస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు కంకర వేసిన ప్రాంతం వదిలేస్తే మిగిలిన రోడ్డు మధ్య పాత బీటీ కేవలం 7మీటర్లు మాత్రమే రాకపోకలకు అనుకూలంగా ఉంది. రోడ్డుపై రాయచూర్ నుంచి కోదాడ వరకు వెళ్లే వాహనాలతోపాటు నాగర్‌కర్నూల్, వనపర్తి వైపు వెళ్లే వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతుంటాయి. ఆయా గ్రామాల నుంచి పట్టణానికి వచ్చిపోయే వారి సంఖ్య చెప్పనక్కర లేదు. ఫార్మా సెజ్‌లోకి వెళ్లే ఉద్యోగుల బస్సులు, స్కూల్ బస్సులు ఇలా వందల సంఖ్యలో రోడ్డుపై ప్రయాణం చేస్తుంటాయి. ఈ కారణంగా ఉదయం, సాయంత్రం ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య తలెత్తుతూనే ఉంది. రోడ్డుకిరువైపులా కంకర వేయటంతో ఆప్రాంతంలో ద్విచక్రవాహనాలు, కార్లు నిలిపి ఉంచటంతో ఆ ప్రాంతం నుంచి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది కలుగుతుంది. పోలీసులు వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికి ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు.

కనెక్టివిటీ రోడ్ల వద్ద అధ్వానం

జాతీయరహదారి నుంచి కాలనీలకు వెళ్లే కనెక్టివిటీ రోడ్ల వద్ద పరిస్థితులు ప్రమాదంగా మారాయి. కాలనీ రోడ్డుకన్నా ఎత్తులో డ్రెయినేజీ నిర్మించటం వల్ల వాహనాలు వెళ్లేందుకు రావడం లేదు. కాలనీలకు వెళ్లే రోడ్డుపై మట్టి సక్రమంగా వేయకపోవటంతో వాహనదారులు కష్టపడుతున్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్

రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలనే డిమాండ్ పెరుగుతుంది. వాహనాల రద్దీ తగ్గించేందుకు రోడ్డుకు ఒకవైపు బీటీ వేయాలని ప్రజలు కోరుతున్నప్పటికి కాంట్రాక్టర్ ఆ దిశగా అడుగులు వేయటం లేదు. అధికారులు సైతం కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురాకుండా ఉన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న సమయంలో డీఈ బదిలీ కావటం ఆయన స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించలేదు. ఉన్న ఏఈ విస్తరణ పనుల గురించి వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇబ్బంది పడుతున్నాం..



రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా చేస్తుండటం, కంకర వేసి వదిలేయటంతో దుమ్ముతో చాలా ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పనులు ఒకవైపు పూర్తి చేసి మరోవైపు చేపడితే సమస్య ఇంతగా ఉండదు. రోడ్డు పక్కనే నివాసం ఉంటున్నందున ఇంట్లోకి వచ్చే దుమ్ముతో చాలా అవస్థలు పడుతున్నాం.

– అర్చన, గృహిణి, బాదేపల్లి

ఇంటి నిండా దుమ్ము..



రోడ్డు పక్కనే ఇళ్లు ఉండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రిళ్లు భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో వెళ్లటం వల్ల దుమ్ము లేచి ఇళ్లల్లోకి వస్తుంది. ఉదయం లేచి ముఖం కడుక్కునే సమయంలో నోట్లోనుంచి మొత్తం మట్టి వస్తుంది. మా 3వ వార్డు పరిధిలో ఉదయం ఒక్క ట్యాంకర్‌తో నీళ్లు పోస్తున్నారు. ఉదయం నుంచి నిరంతరంగా నీళ్లు పోస్తూ ఉంటే దుమ్ము సమస్య రాదు.

– అనిత, కల్వకుర్తిరోడ్

ఒత్తిడి తెస్తున్నాం..




12వ వార్డు పరిధిలో రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తూనే ఉన్నాం. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్డుకు రెండువైపులా ఒకేసారి పనులు చేయటం తగదని చెప్పినా పట్టించుకోలేదు. కంకర వేసిన వైపు బీటీ వేయాలని చెబుతున్నప్పటికి మొత్తం రోడ్డు వేశాకే బీటీ వేస్తామని చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళుతూనే ఉన్నాం.

– రఘురాంగౌడ్, 12వ వార్డు కౌన్సిలర్, మున్సిపాలిటీ

బాబాయ్.. అబ్బాయ్

మన్నె కుటుంబం నుంచే అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి



మన్నె శ్రీనివాస్‌రెడ్డి



మన్నె జీవన్‌రెడ్డి

నవాబుపేట: పాలమూరు రాజకీయాల్లో సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. అటు పాలకపక్షం.. ఇటు ప్రతిపక్షంలో మండలంలోని గురుకుంట ప్రధాన భూమిక పోషించనుంది. ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్న కుమారుడు మన్నె జీవన్‌రెడ్డిని కాంగ్రెస్‌పార్టీ ప్రకటించింది. ఇదే సందర్భంలో త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూర్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేసింది. బాబాయ్ ప్రతిపక్ష పార్టీలో ఎంపీగా రెండోసారి బరిలో ఉండనుండగా.. అటు అబ్బాయి కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గురుకుంటకు చెందిన మన్నె కుటుంబం సంచలనంగా మారింది.

నవాబుపేటలో 'జీవన' రాగం..

మండలంలో మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి ప్రతిపక్ష పార్టీలో స్తబ్ధత నెలకొంది. ఆయన వెంట బీఆర్‌ఎస్ క్యాడర్ వెళ్తోందన్న ప్రచారం బలంగా వినిపించిన తరుణంలో బాబాయికి రెండోసారి ఎంపీ టికెట్ ఖరారు కావడంతో వెనుకంజ వేసినట్లు సమాచారం. కాగా మండలంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులుండగా ఒకరు మృతిచెందారు. 14 మంది ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ ఉన్నారు. వీరిలో 12 మంది బీఆర్‌ఎస్, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఉన్నారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో పెద్దఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

చంద్రగఢ్ లిఫ్ట్ ఆపరేటర్‌పై ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయకట్టు రైతులు

అమరచింత: కళ్లెదుటే సాగుచేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయని కలత చెందిన చంద్రగఢ్ లిఫ్ట్ రైతులు లిఫ్ట్ ద్వారా నీటిని మళ్లించారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు ఇందుకు సహకరించిన లిఫ్ట్ ఆపరేటర్ నారాయణపై ఫిర్యాదు చేయడంతో లిఫ్ట్ రైతులు ఆగ్రహంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ గోడును పట్టించుకోని అధికారులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. యాసంగిలో సాగునీటిని అందించలేమని ప్రభుత్వం ప్రకటించిందని వీటిని అతిక్రమించి మూసి ఉన్న చంద్రగఢ్ లిఫ్టు షట్టర్ తెరిచి అక్కడి ఆపరేటర్‌తో మోటార్లను ఆన్ చేయించడంతో పీజేపీ నందిమళ్ల డ్యాం డివిజన్ ఏఈ ఆంజనేయులు అమరచింత పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో చంద్రగఢ్ ఎత్తిపోతల పరిధిలోని చంద్రగఢ్, మిట్టనందిమళ్ల, కిష్టంపల్లి, నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ పంటలకు నీళ్లు ఇవ్వమంటే కేసులు పెట్టడం ఏమిటని ఇరిగేషన్ ఏఈని ప్రశ్నించారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు కేవలం తాగునీటి అవసరాల కోసమే నీటిని పొదుపుగా వాడుకుంటున్నామని ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు తెలిపారు.

అడవుల రక్షణకు పటిష్ట చర్యలు



నల్లమల అటవీ ప్రాంతంలో వాచ్ టవర్‌ను ప్రారంభిస్తున్న రాకేష్ మోహన్ డోబ్రియాల్

- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రాఖేష్ మోహన్ డోబ్రియాల్

లింగాల/అమ్రాబాద్: నల్లమల అటవీ ప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు చేపడతున్నట్లు అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రాకేష్ మోహన్ డోబ్రియాల్ అన్నారు. లింగాల మండలంలోని పెద్దగుట్ట సమీపంలో అన్ని హంగులతో నిర్మించిన అటవీశాఖ వాచ్ టవర్‌ను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు నల్లమల చాలా దట్టమైన ప్రాంతమని, నేడు ఏడారిగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. అటవీ సంపద, వన్యమృగాలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే అటవీ ప్రాంతంలో దాదాపుగా రూ.20 లక్షల ఖర్చుతో ఆధునిక పరిజ్ఞానంతో వెయ్యి మీటర్ల ఎత్తులో మూడంస్తుల వాచ్ టవర్‌ను నిర్మించి.. భౌరమ్మ వాచ్ టవర్‌గా నామకరణం చేసినట్లు తెలిపారు. టవర్‌పై నుంచి అత్యాధునిక కెమెరా పరికరాలతో వందల కిలో మీటర్ల మేరకు గమనించే వీలుందని అన్నారు. ఎవరైనా అడవుల్లోకి ప్రవేశించినా, వన్యమృగాల వేట, అటవీ సంపదను తరలించడం వంటి వాటిని పరిశీలించి, తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వేసవిలో అటవీ ప్రాంతానికి నిప్పంటుకుంటే తక్షణమే స్పందించి, మంటలను అదుపుచేసే అవకాశం ఉందన్నారు. అనంతరం వాచ్ టవర్ వద్ద మొక్కలు నాటారు.

– పదర మండలం మద్దిమడుగు రేంజ్ పరిధిలో కృష్ణానది వెంట బోట్ పెట్రోలింగ్‌ను రాఖేష్ మోహన్ డోబ్రియాల్ పరిశీలించారు. గడ్డి క్షేత్రాలు, జింకల పునరుత్పత్తికి తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వేసవిలో నీటి సమస్య వల్ల వన్యప్రాణులు వ్యవసాయ పొలాల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని.. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీ జావేద్, డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి, ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజీ, ఎఫ్‌డీఏలు తిర్మల్‌రావు, శ్రీనివాస్, జయదేవ్, ఎఫ్‌ఆర్‌ఓలు వీరేష్, ఆదిత్య, బీట్ ఆఫీసర్లు ఖాదర్ పాషా, శివాజీ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

- ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు
- భారీగా తరలివచ్చిన భక్తజనం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పంచామృతాలతో అభిషేకించారు. కల్యాణానికి ముందు ఉత్సవ మూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, మండపారాధన, అంకురార్పణ, ధ్వజారోహణం, సర్వదేవత ఆవాసన, శివపార్వతుల కల్యాణాన్ని ప్రధాన అర్చకులు, వేదపడింతుడు వీరయ్యశాస్త్రి శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే పలు శివాలయాల్లో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. మహిళల కోలాటాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆయా ఆలయాల అధ్యక్షులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కనులపండువగా జరిగిన ఆది దంపతుల కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



ఇసుక టిప్పర్లకు అడ్డుగా నిలిచిన గ్రామస్తులు

మిడ్జిల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో శనివారం అనుమతుల పేరిట అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతి సాకుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. ఇసుక తరలింపు వల్ల భూగర్భ జలాలు తగ్గి బోరుబావులు ఎండిపోతాయని జిల్లా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి ఇసుక రవాణ అరికట్టాలని కోరారు. నర్సింహరెడ్డి, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, యాదయ్య, కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్ చేసిన ఎమ్మెల్యే




ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: వృత్తిరీత్యా ఆయన వైద్యుడే అయినప్పటికీ ప్రస్తుతం ఎమ్మెల్యే హోదాలో ఉన్నారు. నిత్యం బిజీగా గడిపే ఆయన శనివారం పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో చిన్నారికి అపెండిక్స్ ఆపరేషన్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మోయిజ్‌అలీ కూతురు అలియానాజ్ కొన్ని రోజుల నుంచి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుంది. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూయించినా కడుపునొప్పి తగ్గలేదు. స్కానింగ్ చేయగా అపెండిక్స్ అని వైద్యులు నిర్ధారించారు. దీంతో శస్త్రచికిత్సకు డబ్బులు లేక ఇబ్బంది పడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పాలని సూచించారు. శనివారం వైద్యుల సాయంతో స్వయంగా ఎమ్మెల్యేనే శస్త్రచికిత్స చేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

చిన్నారుల కిడ్నాప్ యత్నం అవాస్తవం

- సీఐ కనకయ్య గౌడ్



మాట్లాడుతున్న సీఐ కనకయ్య గౌడ్

నాగర్‌కర్నూల్ క్రైం: మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో చిన్నారులను కిడ్నాప్ చేయడానికి యత్నించారన్నది అవాస్తవమైన ప్రచారమని నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య గౌడ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆటో డ్రైవర్ గౌస్‌తో పాటు ఉయ్యాలవాడ సమీపంలోని ఓ కళాశాల పనిచేసే ఫర్జానా శుక్రవారం గ్రామంలో అద్దె గదికోసం వెతికారన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఇరువురు చిన్నారులను అద్దెగదులు చూయించాలని కోరారని పేర్కొన్నారు. దీంతో చిన్నారులు ఆటోలో వెళ్తుండగా తండ్రి గుర్తించాడని... కిడ్నాప్ చేస్తున్నారని అపోహపడ్డాడని వివరించారు. ఈ క్రమంలోనే చిన్నారుల కిడ్నాప్‌కు వారు వచ్చారనే ప్రచారం జరిగిందన్నారు. అసత్యాలను సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేసి ప్రజలను అనవసర భయాందోళనలకు గురిచేయవద్దని కోరారు.

నవ దంపతుల ఆత్మహత్య

- రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న జంట



కుమార్, కుమారి (ఫైల్)

కోస్గి: పెద్దలను ఎదురించి ప్రేమ వివాహం చేసుకుని.. బతుకుదెరువు కోసం సొంత ప్రాంతాన్ని వదిలేసి వచ్చిన ఆ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన మంట్లు కుమార్ (25), అదే రాష్ట్రానికి చెందిన సంజుకుమారి (22)కొంత కాలంగా ప్రేమించుకున్నారు. పెద్దలు నిరాకరించడంతో వారిని ఎదురించి పెళ్లి చేసుకున్న ఆ జంట రెండు నెలల క్రితం బతుకు దెరువు కోసం కోస్గికి వచ్చారు. పట్టణ శివారులోని నారాయణపేట రోడ్డులో ప్రేమ వివాహం చేసుకున్నారు. గంజిపల్లి వెంకటయ్య ఇంట్లో అద్దెకు దిగారు. కుమార్ కడంపల్లి పరిధిలోని ఓ మిల్లులు దినసరి కూలీగా పనిచేస్తుండగా, అతని భార్య సంజు కుమారి ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఎప్పటిలాగే పనికి వెళ్లిన మంట్లు కుమార్ ఇంటికి వెళ్లి వస్తానని గుమస్తా జగదీష్‌కు చెప్పి మిల్లునుంచి బయల్దేరాడు. మధ్యాహ్నం దాటినా తిరిగి పనికి రాకపోవడంతో గుమస్తా ఫోన్ చేశాడు. కుమార్ స్పందించకపోవడంతో మరో కూలీతో కలిసి వారు నివాసం ఉంటున్న అద్దె ఇంటి దగ్గరకు వచ్చారు. ఇంటి లోపలి నుంచి గడియ పెట్టిఉండడంతో అనుమానం వచ్చి కిటికీ అద్దాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి చూశారు. అప్పటికే కుమారి హాల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉండటంతో ఆమె మృతదేహాన్ని కిందకు దించారు. మరో గదిలో భర్త కూడా ఉరివేసుకోవడంతో ఇంటి యజమాని ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఇంటి యజమాని వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతిపై కత్తితో దాడిచేసేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ శనివారం తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో బస్టాండ్‌లో యువతిపై దాడికి పాల్పడేందుకు యత్నించిన బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన యువకుడు యువతులను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి నుంచి పలు విషయాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. యువతిపై దాడికి పాల్పడేందుకు యత్నించిన వ్యక్తికి సంబంధించిన పూర్తి విషయాలు త్వరలోనే వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

కాళ్ల బేరం ఓకే

ఎట్టకేలకు బీజేపీతో కుదిరిన చంద్రబాబు పొత్తు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మూడు రోజుల పాటు ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇంటి ముందు పడిగాపులు పడిన అనంతరం ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో టీడీపీ – జనసేన పొత్తు కుదిరింది. ఈ మేరకు శనివారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు , జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల సంపూర్ణ మద్దతు తమకు ఉంటుందని ఆశిస్తున్నట్లు వారు ఆకాంక్షించారు. పొత్తుల వ్యవహారంలో బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు మూడు రోజుల పాటు హస్తినలో మకాం వేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు శనివారం మరోసారి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పొత్తుల అంశంపై అసంపూర్తిగా ఆగిపోయిన అంశాలపై, బీజేపీ డిమాండ్లపై చర్చించారు. రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ, జనసేన పార్టీలకు కలిపి 8 స్థానాలను, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 అసెంబ్లీ సీట్లను కేటాయించేందుకు ముగ్గురి మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని టీడీపీ వర్గాల సమాచారం. కాగా, లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలపై చర్చించేందుకు ఒకటి రెండు రోజుల్లో మరోసారి మూడు పార్టీల నాయకులు భేటీ అవుతారని ఆయా పార్టీలు ప్రకటించాయి. కాగా, ఎన్డీఏలో చేరాలన్న టీడీపీ, జనసేనల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు జేపీ నడ్డా తెలిపారు.

చకోర పక్షుల్లా ఎదురుచూపు

చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లకు బీజేపీతో పొత్తు విషయంలో ఎదురుచూపులు తప్పలేదు. వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనేందుకు ధైర్యం లేని టీడీపీ.. జనసేనతో పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. అయినా వైఎస్ జగన్‌పై పోటీకి బలం సరిపోదని కొద్ది రోజులుగా బీజేపీ సాయం కోరుతూ వస్తోంది. ఇందులో భాగంగా మూడు రోజుల క్రితం బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకోవాలని ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు గురువారం మొదటి దఫా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. అయితే బీజేపీ, జనసేనలకు కలిపి కేటాయించే సీట్ల విషయంలో జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. తమ డిమాండ్లకు తగ్గట్లుగా 8 నుంచి 10 లోక్‌సభ స్థానాలను కేటాయించాలని బీజేపీ డిమాండ్ చేసింది. అంతేగాక పార్టీలో అంతర్గతంగా తాము చర్చించుకున్న తర్వాత మరోసారి కలుద్దామని బాబు ద్వయానికి స్పష్టం చేసింది. శుక్రవారం మొత్తం బీజేపీ పెద్దల నుంచి కబురు వస్తుందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చకోర పక్షుల్లా ఎదురు చూశారు. అయితే శనివారం ఉదయం పొత్తుల వ్యవహారంపై చర్చించేందుకు అమిత్ షా, నడ్డాలను కలవాలని అమిత్ షా కార్యాలయం నుంచి పిలుపు రాగానే ఉదయం 11:10 గంటలకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు షా నివాసానికి చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు జరిగిన చర్చల అనంతరం బాబు ద్వయం అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం కలిసి పోటీ చేసే విషయంపై మూడు పార్టీల మధ్య అవగాహన కుదిరిందని సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.

నీతిలేని బాబు.. అనైతిక పొత్తు

రాష్ట్ర ప్రయోజనాల పేరు చెప్పి సొంత వ్యవహారాలను చక్కదిద్దుకోవడంలో నేర్పరి అయిన చంద్రబాబు మరోసారి అదే బాట ఎంచుకుని బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారు. తద్వారా తాను నీతి లేని రాజకీయ నాయకుడినని, తనకు రాజకీయ అవసరాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలతో పని ఉండదని నిరూపించారు. పైకి రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు అని బిల్డప్ ఇచ్చుకుంటున్నా, అవినీతి కేసుల నుంచి తనను రక్షించుకోవడమే లక్ష్యంగా ఆయన బీజేపీ పెద్దల ఎదుట సాగిలపడినట్లు స్పష్టమవుతోంది. మూడు రోజులపాటు ఢిల్లీలోనే తన పార్ట్‌నర్ పవన్ కళ్యాణ్‌తో కలిసి మకాం వేసి.. అమిత్ షా కరుణ కోసం పాకులాడటం స్పష్టంగా కనిపించింది. తనను కేసుల నుంచి బయట పడేయాలని, అందుకోసం తాను దేనికైనా సిద్ధమని కాళ్లావేళ్లాపడి పొత్తుకు ఒప్పించారని తెలుస్తోంది. దీంతో టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేయనున్నట్లు బీజేపీ కేంద్ర కార్యాలయం శనివారం సాయంత్రం అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. సీట్ల సర్దుబాటు మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. త్వరలో ఏ సీట్లలో ఎవరు పోటీ చేస్తారో తేలుతుందని బీజేపీ ప్రకటించినా, చంద్రబాబు మాత్రం బీజేపీకి 6 ఎంపీ, 6 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినట్లు ఎల్లో మీడియాకు లీకులిచ్చారు. జనసేన, బీజేపీకి కలిపి 30 ఎమ్మెల్యే, 8 ఎంపీ స్థానాలు కేటాయించినట్లు ఎల్లో మీడియాలో అదేపనిగా ప్రచారం చేయిస్తుండడం గమనార్హం.

పైకి బీజేపీ, జనసేన.. లోపల కాంగ్రెస్‌తో..

గతంలో నోటికొచ్చినట్లు తిట్టిపోసి, విడిపోయిన ఎన్డీఏతో మళ్లీ కలిసి ప్రయాణించేందుకు చంద్రబాబు సిగ్గు విడిచి చేతులు కలపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని మోదీని వ్యక్తిగతంగా దూషించి, ఎన్డీఏ ప్రభుత్వాన్ని అనరాని మాటలు అని.. ఇప్పుడు ఆ విషయాన్నే మరచిపోయినట్లు నటిస్తూ రాజకీయ లబ్ధే పరమావధిగా ఇప్పుడు మళ్లీ పొత్తు కుదుర్చు కున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒకవైపు అధికారికంగా బీజేపీ, జనసేనతో పొత్తు కుదుర్చుకుని.. తెరవెనుక లోపాయికారిగా కాంగ్రెస్‌తోనూ అవగాహనతో ఉన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల.. చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడుతుండడం, ఆమెకు బాబు మద్దతుగా నిలిచి మాట్లాడుతుండడం తెలిసిందే. ఇలా అపవిత్ర పొత్తులు, అవగాహనల ద్వారా తనకంటూ ఒక విధానం, ఒక పద్ధతి లేదనే విషయాన్ని చంద్రబాబు నిస్సిగ్గుగా చాటి చెబుతున్నారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే..

సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు ఇప్పటికే జనసేనతో బంధాన్ని కొనసాగిస్తున్నారు. జగన్‌కు పోటీ ఇవ్వడానికి అది సరిపోదనే భావనతో కేంద్రంలో బీజేపీ మద్దతు కోసం చాలా కాలంగా ప్రాధేయ పడుతున్నారు. సరికొత్త గిమ్మిక్కులతో ఎట్టకేలకు ఆ కూటమితో జట్టుకట్టారు. మూడు రోజులు అమిత్‌షా ఇంటి వద్దే పడిగాపులు పడి, చివరికి బీజేపీ ఏం చెప్పినా చేసేందుకు సిద్ధపడి ఎన్డీఏలో చేరుతున్నారు. బీజేపీ, జనసేనతో కలిసి నడిస్తేనే ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి కనీస పోటీ అయినా ఇవ్వగలనని మొదటి నుంచి బాబు భావిస్తున్నారు. టీడీపీని బతికించుకోవడంతోపాటు తన కొడుకు రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే బీజేపీతో సయోధ్య తప్పదనే ఆలోచనతోనే సిగ్గు విడిచి ఆ పార్టీతో జట్టు కట్టారని స్పష్టమైంది.

మోదీని తిట్టి.. ఎన్డీఏపై అవిశ్వాసం పెట్టి..

ఇదే చంద్రబాబు 2018లో ఎన్డీఏ నుంచి నిష్క్రమించాక బీజేపీ పెద్దలను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. 2014లో తన ప్రయోజనం కోసం ఎన్డీఏతో కలిసి పోటీ చేశారు. గెలిచాక కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీతో అధికారాన్ని పంచుకున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి రాష్ట్రాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టారు. దానిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం, వైఎస్ జగన్ ప్రత్యేక హోదా కోసం అలుపెరుగని పోరాటం చేయడంతో భయపడి 2018లో యూటర్న్ తీసుకుని ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌తో కలిశారు. ఆ తర్వాత చంద్రబాబు ఎన్డీఏను టార్గెట్ చేసుకుని చేసిన విమర్శలు, ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి నమ్మకద్రోహం చేసిందని, హోదా ఇవ్వకుండా మోసం చేసిందని, ప్రధాని మోడీది విఫల ప్రభుత్వమని, ఆయన దేశాన్ని ముంచేశాడని, దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రకరకాల ఆరోపణలు గుప్పించారు. ప్రధాని మోదీ తనకంటే జూనియర్ అని, అదృష్టం బాగుండి ప్రధాని అయ్యారని, ఆయన వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారంటూ లెక్కలేనన్ని విమర్శలు చేశారు. చివరికి ప్రధానిని ఉగ్రవాది అని కూడా దూషించారు. ఆయన తల్లిని, భార్య పేర్లను ప్రస్తావించి మరీ దిగజారుడు ఆరోపణలకు దిగారు. ప్రధాని రాష్ట్ర పర్యటనకు వస్తే నల్ల చొక్కాలు, నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసనలు తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తిరుపతి పర్యటనకు వస్తే టీడీపీ నేతలతో రాళ్ల దాడి చేయించారు. అంతటితో ఆగకుండా లోక్‌సభలో ఎన్డీఏకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మోడీని అధికారం నుంచి దించేయాలనేంత వరకూ వెళ్లారు. ధర్మపోరాట దీక్షల పేరుతో నానా హడావుడి చేశారు. కానీ ఆయన వ్యూహాలు, రాజకీయాలు తల్లకిందులై ప్రజలు చంద్రబాబును వదిలించుకున్నారు. చరిత్రలో ఏ రాజకీయ పార్టీకి ఇవ్వనంత ఘోర వైఫల్యాన్ని కట్టబెట్టారు.

కోవర్టుల సాయంతో బీజేపీ చెంతకు

2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయాక కాంగ్రెస్‌ను వదిలేసిన చంద్రబాబు.. వెంటనే నిస్సిగ్గుగా బీజేపీని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఓడిపోయిన మరుసటి రోజు నుంచే బీజేపీ ప్రాపకం కోసం పరితపిస్తూనే ఉన్నారు. కానీ చంద్రబాబు గుంట నక్క రాజకీయాలు గ్రహించిన ప్రధాని మోడీ ఆయన్ను ఇన్నాళ్లూ దరి చేరనీయలేదు. అయినా చంద్రబాబు పట్టు విడవకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇందుకోసం తన బినామీలైన సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి వారిని అధికారం పోగానే బీజేపీలోకి పంపారు. వారు బీజేపీలో ఉంటూనే చంద్రబాబు కోవర్టులుగా పనిచేస్తూ ప్రస్తుతం పొత్తు కుదర్చడంలో కీలక భూమిక పోషించారు. రాష్ట్ర బీజేపీలోని ముఖ్య నాయకులను తన గుప్పిట్లో పెట్టుకుని వారి ద్వారా బీజేపీతో కలిసేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేశారు. మరోవైపు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ద్వారా బీజేపీతో పొత్తు కలిపేలా చేసి ఆయన్ను కూడా తన కోసం పని చేయించుకున్నారు. జనసేన బీజేపీతో పొత్తులో ఉండగానే, తాను జనసేనతో పొత్తు పెట్టుకుని మూడు పార్టీలు కలిసి పని చేయాలనే దిక్కుమాలిన వ్యూహాన్ని అమలు చేశారు. అందులో భాగంగా టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని పవన్ కళ్యాణ్ కూడా బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడ్డారు. ఈ విషయాన్ని ఆయనే ఇటీవల స్వయంగా బయటపెట్టారు. పొత్తు కుదిర్చే క్రమంలో బీజేపీ పెద్దలతో తాను ఛీవాట్లు తిన్నట్లు కూడా చెప్పారు. దీన్నిబట్టి చంద్రబాబు బీజేపీతో కలిసేందుకు తెర వెనుక ఎందరిని ప్రయోగించారో, ఎన్ని కుయుక్తులు పన్నారో అర్థమవుతోంది. మొత్తంగా చంద్రబాబు కాళ్ల బేరానికి రావడంతో బీజేపీ పెద్దలు పొత్తుకు అంగీకరించినట్లు స్పష్టమవుతోంది. రాజకీయ స్వార్థం కోసం చంద్రబాబు రెండవసారి బీజేపీతో కలవడంపై రాష్ట్ర ప్రజలు నివ్వెరపోతున్నారు.

జైత్రయాత్రకు ‘సిద్ధం’

నేడు బాపట్ల జిల్లా మేదరమెట్ల వేదికగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల సన్నాహక సభ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడానికి బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడు వద్ద ఆదివారం జరగనున్న ‘సిద్ధం’ ఆఖరి సభకు సర్వం సిద్ధమైంది. చరిత్రలో నిలిచిపోయేలా పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగసభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అద్దంకి నియోజకవర్గంలో మేదరమెట్ల వద్ద కోల్‌కత-చెన్నై జాతీయ రహదారి పక్కనే వందలాది ఎకరాల సువిశాల మైదానంలో ఈ సభను నిర్వహించడానికి భారీ ఏర్పాట్లుచేశారు. దక్షిణ కోస్తాలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని 44 నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో కదలిరానున్నారు. వీరిని ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి సీఎం జగన్ ఇప్పటికే భీమిలి, దెందులూరు, రాప్తాడులలో నిర్వహించిన సిద్ధం సభలు ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయిన విషయం తెలిసిందే. రాప్తాడు సభ ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే అతిపెద్ద ప్రజాసభగా నిలిచిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషించారు. మూడు సిద్ధం సభలు గ్రాండ్ సక్సెస్ కావడం.. టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్ మ్యారిటైజ్ వంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సునామీ సృష్టించడం ఖాయమని తేలడంతో చివరి ‘సిద్ధం’ సభకు కూడా ఉరిమే ఉత్సాహంతో కార్యకర్తలు, నేతలు, అభిమానులు భారీ ఎత్తున తరలివెళ్లడానికి సంసిద్ధమయ్యారు.

పొత్తుల లెక్కతేలినా నైరాశ్యం..

ఇక టీడీపీ–జనసేన పొత్తుల లెక్క తేలాక రెండు పార్టీలు మొదటిసారిగా ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ‘జెండా’ సభకు జనం మొహం చాటేశారు. ‘రా కదలిరా’ పేరుతో చంద్రబాబు నిర్వహిస్తున్న సభలకు ప్రజలు తరలిరావడంలేదు. టీడీపీ–జనసేన పొత్తును ఆదిలోనే జనం ఛీకొట్టడం.. వైఎస్సార్‌సీపీ సిద్ధం సభలు గ్రాండ్ సక్సెస్ కావడంతో ఆ రెండు పార్టీల శ్రేణులు నైతికస్థైర్యాన్ని కోల్పోయాయి. అలాగే, టీడీపీ–జనసేన పొత్తు కుదిరాక టైమ్స్‌నౌ–ఈటీజీ సంస్థ నిర్వహించిన సర్వేలోనూ 49% ఓట్లతో వైఎస్సార్‌సీపీ 21–22 లోక్‌సభ స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని.. టీడీపీ–జనసేన కూటమి 45% ఓట్లతో 3–4 లోక్‌సభ స్థానాలకే పరిమితమవుతుందని తేల్చి చెప్పింది. ఇది ఆ 2 పార్టీ శ్రేణులను తీవ్ర షాక్‌కు గురిచేసింది. దీంతో ఎన్నికలకు ముందే శ్రేణులు కకావికలమవుతుండటంతో ఉనికి చాటుకునేందుకు చంద్రబాబు ఢిల్లీలో బీజేపీ పెద్దల కాళ్లా వేళ్లా పడి.. ఆ పార్టీతోనూ పొత్తు ఖరారు చేయించుకున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మళ్లీ ఎన్డీఏలో చేరాం

- బీజేపీతో పొత్తు కుదిరింది.. సహకరించండి
- టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు
- పలు సమస్యలకు ‘పొత్తు’ పరిష్కారం : పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: బీజేపీతో పొత్తు కుదిరిందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం మళ్లీ ఎన్డీఏలో చేరుతున్నట్లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. శనివారం ఢిల్లీ నుంచి ఆయన టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బీజేపీతో పొత్తు ఖరారైన నేపథ్యంలో కొన్ని సీట్లను వదులుకోక తప్పదన్నారు. పరిస్థితులను అర్థం చేసుకోవాలని నేతలకు సూచించారు. సీట్ల పంపకం చివరి దశకు చేరుకుందని, మరో సమావేశం తర్వాత పూర్తి స్పష్టత వస్తుందని తెలిపారు. పొత్తులో భాగంగా ప్రస్తుతానికి 30 అసెంబ్లీ, 8 పార్లమెంట్ స్థానాలను బీజేపీ, జనసేనలకు ఇస్తున్నట్లు నేతలకు తెలిపారు. టీడీపీ–బీజేపీ–జనసేన మధ్య పొత్తుపై ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. టీడీపీకి కేంద్రం సహకారం చాలా అవసరమని, పొత్తుకు ఇదే కారణమని చెప్పారు. ఈ నెల 17న టీడీపీ–జనసేన నిర్వహించే ఉమ్మడి భారీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానించామని తెలిపారు. మూడు పార్టీలు కలిసి ఉమ్మడి సభ నిర్వహిస్తామని చెప్పారు. మోదీ పాల్గొనే అవకాశం ఉందని, ఇందుకు అనువైన ప్రదేశం ఎంపిక చేయాలని నేతలకు సూచించారు. ఈ నెల 17 లేదా 18 తేదీల్లో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇదిలా ఉండగా ‘తిరిగి ఎన్డీఏలో చేరినందుకు సంతోషిస్తున్నా. పవన్ కళ్యాణ్‌తో కలిసి, ఏపీలో ప్రజల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, అభివృద్ధిలో కొత్త శకానికి నాంది పలికేందుకు, మోదీతో కలిసి పని చేయడం కోసం ఎదురుచూస్తున్నా’ అని ఎక్స్‌లో చంద్రబాబు పోస్ట్ చేశారు. ఇది మూడు పార్టీల మధ్య పొత్తు మాత్రమే కాదని, దేశానికి సేవ చేయడానికి కట్టుబడి ఉన్న ముగ్గురి భాగస్వామ్య మని పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర విభజన కారణంగా రాష్ట్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో పదేళ్లగా కొనసాగుతున్న గందరగోళంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కారణంగా ఐదేళ్లుగా తలెత్తిన సమస్యలు బీజేపీ, టీడీపీ, జనసేన కలయికతో తీరబోతున్నాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఎన్డీయేలో భాగస్వామిని చేసినందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ధన్యవాదాలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

28 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని శనివారం పట్టుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. గద్వాల వైపు నుంచి 28 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయచూర్‌కు బొలెరా వాహనంలో తరలిస్తుండగా కేటీ దొడ్డి మండలం కుచినెర్ల శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న ఎరుకలి శివకుమార్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీసీ గురుకులంలో విద్యార్థుల అస్వస్థత

- వాంతులు, కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరిక



మక్తల్: పట్టణంలోని యల్లమ్మకుంట వీధిలో ఉన్న బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం నుంచి నీరసంగా ఉండడంతో రాత్రి 8గంటలకు వాంతులు రావడంతో వెంటనే గురుకుల పాఠశాల నుంచి ఆటోలో నలుగురిని ప్రభుత్వ ఆస్పత్రికి ఉపాధ్యాయులు తరలించారు. విద్యార్థినులు వాంతులు, కడుపునొప్పితో బాధపడుతున్నారని, చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా విద్యార్థినులు ఆస్పత్రికి వెళ్లిన విషయం వారి త ల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని తెలిసింది.

హరహర మహాదేవ శంభోశంకర

- శోభాయమానంగా బాలబ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం
- వేలాదిగా పాల్గొన్న భక్తజనం



భక్తులకు హారతిని అందజేస్తున్న ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: అశేష జన వాహిని మధ్య శనివారం బాలబ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం శోభాయమానంగా జరిగింది. హర హర మహాదేవ శంభోశంకర అంటూ భక్తజనం స్వామివారి రథాన్ని ముందుకు కదిలించారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అలంపూర్ క్షేత్రంలో బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబదేవి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు, బలిభేరి త్రిశులాన్ని హంస వాహనంపై ఆలయాల నుంచి మంగళ వాయిద్యాల మధ్య రథశాల వద్దకు తీసుకొచ్చారు. అక్కడ విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన రథంపై ఆది దంపతులు కొలువుదీరగా.. అర్చకులు రథాంగహోమం నిర్వహించి, ఉత్సవ మూర్తులను రథంలో అలంకరించారు. తరతరాల సంప్రదాయానికి స్వాగతం పలుకుతూ.. పొలి విరజిమ్మారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు గుమ్మడికాయ కొట్టి, రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలో స్వామివారి ఊరేగింపు జరిగే వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయగా.. రథానికి అలంకరించిన చిరు దీపాల వెలుగుల మధ్య రథోత్సవం శోభాయమానంగా సాగింది. ఎస్‌ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

రథోత్సవం విశిష్టత..

రథస్థం ఈశ్వరం దష్ట్వా పునర్జన్మ నవిద్యతే.. అన్న వేదోక్తి ప్రకారం రథంలో విహరించే పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుంటే పునర్జన్మ అనేది ఉండదనేది శాస్త్ర వచనమని ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ తెలిపారు. రథం అంటే కదిలే దేవాలయమని పేర్కొన్నారు. నిజానికి దేవాలయం అనేది కదలదని.. అది యంత్ర, మంత్ర ఆగమాలతో చేసిన స్థిరప్రతిష్ఠగా తెలిపారు. అనారోగ్యం, నడవలేని పరిస్థితి, జ్ఞానం లేక అజ్ఞానం వైపు ఉండి నాస్తికత్వంతో ఆలయానికి వెళ్లలేని వారికోసం, మనుష్య జన్మ కాకుండా జంతుజన్మలు ఎత్తి భగవంతుడిని దర్శించలేని వివిధ ప్రాణులను బాలబ్రహ్మేశ్వరుడు, జోగుళాంబదేవి రథోత్సవ రూపంలో అనుగ్రహిస్తున్నారని చెప్పారు.



ఆది దంపతులను హంస వాహనంపై కొలువుదీర్చి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఈఓ పురేందర్‌కుమార్

సోషలిస్టుతోనే పేదరికం అంతం సాధ్యం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసుఫ్



మాట్లాడుతున్న యూసుఫ్

అమరచింత: సమాజంలోని సంపద సమానంగా ప్రతి ఒక్కరికి అంది, పేదరికం అంతం కావాలంటే సోషలిస్టు రాజ్యంతోనే సాధ్యమవుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అన్నారు. మండలంలోని కొంకన్వానిపల్లెలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సీపీఐ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించిన ఘనత సీపీఐకే ఉందన్నారు. పెట్టుబడి దారుల చేతిలో సంపద పోగుపడిందని, ఫలితంగా దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని ఆరోపించారు. ఐడీపీఎల్, ఎల్‌ఐసీ, ఎయిర్‌ఫోర్స్, రైళ్లు, విద్యుత్ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ పరం చేయటం వల్ల ప్రజలపై భారం పెంచుతున్నారని ఆరోపించారు. మానవ పరిణామక్రమము మార్కిస్ట్ మూల సూత్రాలు అంశాలపై వివరించారు. పేదరికం అంతం కావలంటే కమ్యూనిష్టు రాజ్య స్థాపన కావాలన్నారు. పేదల పక్షాన పోరాటాలు చేస్తూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీకి ప్రజల అండదండలు ఉన్నాయన్నారు. మతతత్వశక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ దేశ సంపద సామాన్యుడికి అందించే వరకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విజయరాములు, నరసింహశెట్టి, అబ్రహం, రాబర్ట్, భాస్కర్, శ్రీహరి, కుతుబ్, శ్యాంసుందర్, మల్లేష్ పలువురు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న శాంతికుమార్

ఆత్మకూర్: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందని.. మోదీ పాలనపైనే ప్రజలకు నమ్మకం ఉందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రధాని మోదీ రూ.15వేల కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు మరెన్నో పనులకు శంకుస్థాపనలు చేశారని వివరించారు. దక్షిణ భారతదేశంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తనకు పాలమూరు ఎంపీ టికెట్ ఇస్తుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. గతంలో జితేందర్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, డీకే అరుణలకు పోటీచేసే అవకాశం కల్పించారని గుర్తుచేశారు. ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అగ్రవర్ణాల వారికి పాలమూరు టికెట్ కేటాయించాయని, అత్యధికంగా బీసీ ఓటర్లు ఉన్న పాలమూరులో బీజేపీ టికెట్ బీసీ అభ్యర్థికే ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గు చూపుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో విజయ్, ఆనంద్‌కుమార్, బాలకృష్ణ, చిన్న నర్సింహ, రాజు, ఎల్లన్న, బాలు, వెంకటేష్, చందు, శ్యాం ఉన్నారు.

పథకాల అమలును జీర్ణించుకోలేక అక్కసు

- శ్రీమంతులు గ్రామ అభివృద్ధికి పాటుపడాలి
- రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించుకుంటున్న మంత్రి సీతక్క

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతున్నారని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పాలమూరు జిల్లావాసి, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో గొప్ప గొప్ప సంక్షేమ పథకాలను చేపట్టడం అదృష్టంగా భావించాలన్నారు. శనివారం అమ్రాబాద్ మండలం మాచారంలో అనూష ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) అధినేత జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ ఐఐటీ మద్రాస్ మొబైల్ ఐ సర్జికల్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మెగా కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటోడ్రైవర్లను రెచ్చగొట్టే చర్యలకు కల్వకుంట్ల కవిత పాల్పడటం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడే బీఆర్‌ఎస్‌ను ప్రత్యేకించి మహిళా వ్యతిరేక పార్టీగా ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఛీకొడితే అదఃపాతాళంలోకి వెళ్లిన బీఆర్‌ఎస్ సీఎం రేవంత్‌రెడ్డిపై అవాస్తవాలు మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు.

- పుట్టిన ఊరి అభివృద్ధి కోసం ధనవంతులు పరితపించాలని, అలాంటి వారు జలంధర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. చెన్నైలో శ్రీమంతులకు అందుబాటులో ఉండే అధునాతన మొబైల్ శస్త్ర చికిత్స యంత్రాలను గ్రామీణ పేదల వద్దకే తీసుకువచ్చి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడం గొప్ప విషయం అన్నారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు..

ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ పోడు భూములు సాగు చేసుకుంటున్న వారందరికీ పట్టాలు ఇప్పించాలని, వర్షాధారంపై పంటలు సరిగా పండక రైతులు నష్టపోతున్నందున సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. 5 సబ్ స్టేషన్లు ఉన్నప్పటికీ కరెంట్ సమస్య తీరడం లేని కారణంగా 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయించాలన్నారు. చెంచులకు ప్రత్యేక ఉపాధి పథకం పునరుద్ధరణతోపాటు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని, ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న అణగారిన వర్గాల వారికి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలని విన్నవించారు. యూఎస్‌ఐలో ఇంజినీర్ గణపతిరెడ్డి మాట్లాడుతూ డిండిచింతపల్లిలో ఏర్పాటు చేయాల్సిన శిబిరంను జలంధర్‌రెడ్డి కోరిక మేరకు ఇక్కడ చేపట్టామన్నారు. మే నెలలో ఇదే శిబిరం డిండిచింతపల్లిలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ వైద్యం చేయించుకోలేకపోయిన వారు అక్కడికి వచ్చి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెన్నై కంటి వైద్య నిపుణులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ మొబైల్ యంత్రం తయారైన తర్వాత తెలంగాణలో శస్త్రచికిత్స చేయడం హైదరాబాద్‌లో ఒకటి కాగా.. మాచారంలో రెండోది అని చెప్పారు.

వినతి పత్రాల అందజేత..

మంత్రి సీతక్క ఏజెన్సీ ప్రాంతానికి రావడంతో స్థానిక ప్రజలు, ఉద్యోగులు అనేక సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అంతకు ముందు గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడే ఏర్పాటు చేసిన ముఖద్వారం, రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ప్రధాన రోడ్డు నుంచి కిలోమీటరు మేర కోలాటాలు, మహిళల స్వాగతం మధ్య మంత్రి వైద్య శిబిరం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, వైస్ ఎంపీపీ ప్రణీత, పెద్దిరాజు, జలంధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు రేణయ్య, రామచంద్రయ్య, రాజేందర్, ప్రతాప్‌రెడ్డి, హరినారాయణ, చత్రునాయక్, కాశన్నయాదవ్, బుచ్చయ్య, లక్ష్మన్, జగన్, శోభ, సుజాత, శారద, పద్మ పాల్గొన్నారు.